

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:29 (గురువారం సాయంత్రం) సహర్ 5:00 (శుక్రవారం ఉదయం)

సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్

- సీపీ అంబర్ కిశోర్ ఝా




కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ ఏఆర్ సిబ్బంది, అధికారులకు బుధవారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిశోర్ ఝా హాజరై ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా దర్బార్‌లో చెప్పడం, ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చి నేరుగా కలిసి చెప్ప వచ్చునన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మనమందరం ఒక కుటుంబమని, అందరం సమన్వయంతో క్రమ శిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. రామగుండం కమిషనరేట్‌కు, తెలంగాణ పోలీస్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండాలని, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. దీంతో మానసిక, శారీరక ఒత్తిడి నుంచి దూరం కావచ్చన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహించి సిబ్బంది, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

Assembly Budget 2025







అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

- ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి
- ఇందిరమ్మ ఇళ్లకు పెరిగిన నిధులు
- చేయూత ద్వారా పింఛన్లు పెంచే అవకాశం
- ప్రజాపాలన బడ్జెట్ : అధికార పక్షం
- హామీలు మరచిన ప్రభుత్వం : ప్రతిపక్షాలు

రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

పెద్దపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ, ఉప ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని, ఎన్నికల సందర్భం గా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూనే, అభివృద్ధి పనులకు తగిన కేటాయింపులు చేశారని, ఇది అందరికీ ఆమోద యోగ్యంగా ఉంటుందని అధికార పక్ష నేతలు అంటుండగా, 420 హామీలను మరిచిం దని, ఎన్నికల హామీల ప్రస్తావన అంకెల్లోనే ఉంది తప్ప ఆచరణీయం కాదని, అంకెల గారడీని తలపిస్తున్నదని ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు విమర్శిస్తున్నారు. బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ. 3,04,965 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రత్యేకించి రూ.56,084 కోట్లు కేటాయించడం గమనార్హం. ఇందులో రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, ఇంది రమ్మ ఇళ్లకు రూ. 12,571 కోట్లు, చేయూత పథకా నికి రూ. 14,861 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ. 2,080 కోట్లు, మహాలక్ష్మి పథకానికి రూ. 4,305 కోట్లు, సబ్సిడీ గ్యాస్ రూ. 723 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ. 600 కోట్లు, యువ వికాసం పథకానికి రూ. 6 వేల కోట్లు, సన్నాలకు బోనస్ రూ.1800 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కూడా తగిన విధంగా నిధులు కేటాయించారు. నీటి పారుదల రంగానికి రూ. 23,373 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ. 24,439 కోట్లు, విద్యా రంగానికి రూ. 23,108 కోట్లు కేటాయించారు. చేయూత పథకానికి గతంలో కంటే కాస్త ఎక్కువ నిధులు కేటాయించడం వల్ల ప్రస్తుతం ఇస్తున్న రూ. 2 వేల పింఛన్లను పెంచే అవకాశాలు ఉన్నాయి.

బడ్జెట్‌పై అభిప్రాయాలు 8

కేంద్ర పథకాల్లో రైతు కార్డు ఉపయోగం

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి

ఓదెల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో రైతు గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఆదిరెడ్డి అన్నారు. మండలంలోని కొలనూర్ రైతు వేదికలో బుధవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు గుర్తింపు కార్డుల జారీకి కేంద్ర ప్రభుత్వం స్వీకారం చుట్టిందని, ఈ కార్డు ద్వారా రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో 24 గంటల్లో గుర్తింపు కార్డులు జారీ అవుతాయని అన్నారు. కొలనూర్ రెవెన్యూ గ్రామాల రైతులు ఏఈఓను సంప్రదించి గుర్తింపు కార్డులు పొందాలని తెలిపారు.ఏవో భాస్కర్, ఏఈఓ రాకేష్ రైతులు పాల్గొన్నారు.

సాగునీటి తరలింపుపై రైతుల నిరసన



పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

ధర్మారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పొలాలకు, తాగు నీటికి స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతుంటే, ఇతర ప్రాంతాలకు నీటి తరలించడం ఏమిటని రైతులు బుధవారం నిరసన తెలిపారు. ఎల్లంపల్లి పంప్‌హౌజ్ నుంచి మేడారం రిజర్వాయర్‌లోకి రోజుకు 247 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ, మళ్లీ అంతే నీటిని మేడారం నుంచి ఎగువ ప్రాంతాలైన లక్ష్మీపూర్ పంప్ తరలిస్తున్నారని, నిజానికి ఎల్లంపల్లి పంప్‌హౌస్ నుంచి రోజుకు 247 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నప్పటికీ మార్గమధ్యలో వెల్గటూర్, ఎండపల్లి రైతుల పంట పొలాలకు 100 క్యూసెక్కుల వరకు పోతుందని, ఈ లెక్క ప్రాకారం 100 టీఎంసీల పైచిలుకు నీరు మాత్రమే మేడారం రిజర్వాయర్‌లోకి చేరుతుందని ధర్మారం మండల రైతులు వాపోతున్నారు. దీంతో రిజర్వాయర్‌లో నీరు తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు సాన శంకరయ్య, బొర్లకుంట అంజయ్య, మేకల రామస్వామి, సాన చంద్రమౌళి, బండి నందం, మిట్ట సత్తయ్య, మండపెల్లి శివయ్య, బతికెపల్లి అంజయ్య, బొడ్డు నర్సయ్య, పడి దం మల్లయ్య, రాచూరి మల్లేశం పాల్గొనగా వారికి బీఆర్ఎస్ నాయకులు రాచూరి శ్రీధర్, మిట్ట తిరుపతి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశా వర్కర్లు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

పెద్దపల్లిటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రూ. 18 వేల రూపాయల వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమ్మె హామీలు అమలు చేయాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు జి. జ్యోతి మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు వెంటనే చెల్లించాలని, 20 క్యాజువల్ లీవ్స్ ఇవ్వాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. అనంతరం ఆశా వర్కర్లు రాస్తారోకో చేశారు. జిల్లా పరిధిలోని సమస్యలను పరిష్క రిస్తామని, మిగతా సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆశా వర్కర్లకు అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, మార్చి 19,(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత కలెక్టరేట్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21నుండి ఏప్రిల్ 4వరకు 10వ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే సుమారు 7వేల మంది విద్యార్థుల కోసం 41పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాలవద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎక్కడ మాస్‌కాపీంగ్ జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మంథని: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డాక్టర్లను, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో జరుగుతున్న రెనోవేషన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్డీవో ఆఫీసులో డివిజన్ కార్యాలయాల సముదాయ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయింపు, హెచ్‌హెచ్ గ్రీన్‌ఫీల్డు హైవే పనులనుపై అధికారులతో చర్చించారు. మంథని మాతా శిశు సంరక్షణ సెంటర్‌కు పెద్దపల్లి నుంచి గైనకాలజిస్టును కేటాయిస్తున్నట్లు తెలిపారు. మంథని మాతా శిశు ఆసుపత్రిలో ఈ నెల 22 నుంచి మరిన్ని సేవలు అందుబాటులోకి వయస్తాయన్నారు. వరంగల్-మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఆర్డీవో సురేష్, ఇన్‌చార్జి తహశీల్దార్ సిరిపురం గిరి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆసుపత్రి సూపరిండెంట్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



పది పరీక్షలపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్



ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ శ్రీహర్ష

మంథనిరూరల్: మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన అడవిసోమన్‌పల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

చెస్ పోటీల్లో రిటైర్డు ఉద్యోగి రాష్ట్రస్థాయి ప్రతిభ



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 19,(ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కోదాడలో ఈ నెల 16నుంచి 18వరకు రాష్ట్ర స్థాయి క్రీడా,సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొని చెస్‌లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి పొందిన పెద్దపల్లికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు గడ్డాల శ్రీనివాస్‌ను పెద్దపల్లి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పెద్దపల్లి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీవి జీవర్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ప్రకాశం రామరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో విద్యతోనే గౌరవం

● డీసీపీ పుల్ల కరుణాకర్

ఓదెల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యతోనే గౌరవ, మర్యాదలుంటాయని, ప్రతి విద్యార్థి ఏకాగ్రత, పట్టుదలతో చదివితే తప్పకుండా సక్సెస్ అవుతారని డీసీపీ పుల్ల కరుణాకర్ అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బుధవారం పోలీసులు మీకోసంలో భాగంగా మండలంలోని 313 మంది పదవ తరగతి విద్యార్థులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షకు సిద్ధం అయ్యే విద్యార్థులు మనోధైర్యంతో ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపి గజ్జి కృష్ణ పాల్గొన్నారు. సైకాలజిస్టులు అనిత, హరిప్రసాద్, అంజని కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం 313 మంది విద్యార్థులకు డీసీపీ, ఏసీపీ, సీఐ పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దీకొండ రమేష్, ఎంఈఓ రమేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్మికులకు న్యాయం చేయాలి

జ్యోతినగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి లుక శంకర్, బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్టీపీసీ సివిల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి డీజీఎంకు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న విధంగానే పూర్తిస్థాయి మ్యాన్‌పవర్‌తో కాంట్రాక్టు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు. జోన్ 1లో పనిచేస్తున్న 24 మంది కార్మికులకు జనవరి నెల వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపారు. కార్యక్రమంలో చిలుక శంకర్, బుచ్చన్న, డి.రవి, నర్సయ్య, కృష్ణ, రాయమల్లమ్మ, ఓదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై కాంగ్రెస్ సంబరాలు



గోదావరిఖనిలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



ఎలిగేడులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కళ్యాణ్‌నగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ 42శాతం బిల్లు ఆమోదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తూ గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నాయకురాలు కొలిపాక సుజాత హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, దిటీ బాలరాజు, ముస్తఫా, గట్ల రమేష్, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, సుతారి లక్ష్మణ్ బాబు, సాంబమూర్తి, ఉమా, చుక్కల శ్రీనివాస్, దంత శీను, కొమ్ము వేణు, కల్వల సంజీవ్, గుణముక్కుల తిరుపతి, ధూళికట్ట సతీష్, గుంపుల తిరుపతి, అను మ సత్యనారాయణ, రమేష్, ఆడేపు రవి, గుమ్మడి రవి, ఆడెపు దశరథం, సింహాచలం, కనుకుంట్ల అశోక్, అల్లి శంకర్, దొంతుల కిరణ్‌పాల్గొన్నారు.

సుల్తానాబాద్: బీసీలు ఎదురుచూస్తున్న రిజర్వేషన్ల ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన సందర్భంగా సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ బీసీ నాయ కులు పన్నాల రాములు, అమీర్ శెట్టి రాజలింగం, తిరుపతి, మీసా సత్యనారాయణ, గరిగే శ్రీనివాస్, పొన్నం చంద్రయ్య, గాదాసు రవి, మల్లయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు: బీసీ బిల్లు ఆమోదంపై ఎలిగేడులో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, తాటిపల్లి రమేష్‌బాబు, బాలసాని పర్శరాంగౌడ్ ఉన్నారు.

జూలపల్లి: బీసీ బిల్లును ప్రభుత్వం ఆమోదించడం పట్ల కాంగ్రెస్ నాయకులు జూలపల్లిలో సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మెన్ గండు సంజీవ్, నాయ కులు లోక జలపతిరెడ్డి, బొజ్జ శ్రీనివాస్, మాన ం మండ్ల శ్రీనివాస్, ముమ్మాడి రవి, ఎండి గౌస్, కనుకుంట్ల అంజయ్య, అమరగాని లింగయ్యగౌడ్ పాల్గొన్నారు

యైటింక్లయిన్‌కాలనీ: అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం చేయడంపట్ల బుధవారం పట్టణ కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, చాట్ల సదానందం, దుర్గాప్రసాద్, మల్లికార్జున్, వై తిరుపతి, కిషన్‌నాయక్, అనుము రాములు ఉన్నారు

ఓదెల: రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు ఏకగ్రీవ ఆమోదం తెలిపిన సందర్భంగా కొలనూర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య, మాజీ సర్పంచులు సామ శంకర్,కుంచం మల్లయ్య పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో..

కోల్‌సిటీటౌన్: అసెంబ్లీలో బీసీ బిల్లుపై ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు హరీష్‌గౌడ్, బొగ్గుల సాయికృష్ణ పాల్గొన్నారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కవిత ఉద్యమ ఫలితమే బీసీ బిల్లు అని వారు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన రాజస్థాన్ బృందం



సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ వద్ద రాజస్థాన్ బృందం

ఎలిగేడు, మార్చి 19,(ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రత మానవ మనుగడకు దోహదపడుతాయని రాజస్థాన్ ప్రజాప్రతినిధి అధికారుల బృందం స్పష్టం చేసింది. బుధవారం మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామాన్ని రాజస్థాన్ ప్రజా ప్రతినిధులు, అధికారుల బృందం సందర్శించింది. పచ్చదనం, పరిశుభ్రతలో బాగంగా గ్రామంలో అన్ని వార్డులను కలియతిరిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బృందానికి తెలంగాణ ఇన్స్టిట్యూట్ నేషనల్ నేషన్ తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ రూరల్ డెవలప్మెంట్ అధికారి కే.అనిల్ కుమార్ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీవో ఆరిఫ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని గర్రెపల్లి గ్రామంలో రాజస్థాన్ ప్రజాప్రతినిధుల బృందం గుడ్ గవర్నెన్స్ సంబంధించిన అంశాలను పరిశీలించింది. అనంతరం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు.

ప్రేమ పేరుతో బాలికకు వేధింపులు

● పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి
● ఇద్దరిపై కేసు నమోదు

పెగడపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రామభద్రునిపల్లి గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో ఒక యువకుడు, బాలుడు వేధించగా ఆమె పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం బాలిక పెగడపల్లి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రామభద్రునిపల్లి గ్రామానికి చెందిన బాస రాము అనే యువకుడు, గొల్లపల్లిమండలం రంగదాముునిపల్లి గ్రామానికి చెందిన మరొక బాలుడు బాధిత బాలికను ప్రేమ పేరుతో వేధించసాగారు. బాలిక ఒప్పుకోకపోతే పరువు తీస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతోబాలిక ఈనెల 15న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితులిద్దరిపై బీఎన్ఎస్ మరియు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

ప్రాణం తీసిన చేపల వేట

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేపల వేట ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. రెండురోజుల కిందట అదృశ్యమైన భవన నిర్మాణ కార్మికుడు కమటం ఉదయ్‌కిరణ్(35) అదృశ్యమై ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామశివారులోని మానేరు వాగులో బుధవారం శవమై తేలాడు. ఈ సంఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని ఉదయ్‌కిరణ్ స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పనులు చేస్తుండేవాడు. ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభించలేదు. బుధవారం మానేరు వాగు వైపుకు వెళ్లిన రైతులకు గట్టుపై దుస్తులు కనిపించాయి. దాంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు వెలికితీయించారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో పోలీసులు సిరిసిల్ల నుంచి వైద్యులను ఘటన స్థలానికి తీసుకు వచ్చి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య సరళ, ఇద్దరు కూతుళ్లు అవంతిక, అశ్వితలు ఉన్నారు. మృతుడి భార్య సరళ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మానకొండూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన తాండ్ర దేవయ్య(55) తన ఇంటి బంగ్లాపై ఉన్న కవరును తీసుకవచ్చేందుకు వెళ్లాడు. బంగ్లాపై ఉన్న ఇనుపరాడ్డును ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురిఅయి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కారు బోల్తా.. పలువురికి గాయాలు

ముస్తాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామ శివారులో కారు బోల్తా పడి పలువురికి గాయాలైన సంఘటన బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాల్లారెడ్డిపేట మండలానికి చెందిన నవీన్, చరణ్, మనోజ్, అజ్జూలు మంగళవారం పనిమీద హైదరాబాద్‌కు వెళ్లారు. ఉదయం తిరిగి వస్తుండగా కార్ టైర్ పగిలిపోవడంతో పక్కనే ఉన్న కల్వర్టు వైపు దూసుకెళ్లి బోల్తాపడింది. సమీపంలో ఉన్న గ్రామస్థులు కారులో ఉన్న వారిని బయటకు తీసి మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. పెను ప్రమాదం నుండి బయట పడటంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

రిటైర్డ్ తహసీల్దార్, మరో ఇద్దరిపై కేసు నమోదు

చందుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా భూమి పట్టా చేసిన సంఘటనలో రిటైర్డ్ తహసీల్దార్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన దొంగరి వెంకట రాములు చెందిన 73 సర్వే నంబరుగల రెండు ఎకరాల ఎనిమిది గుంటల భూమితో పాటు, దొంగరి శంకర్ చెందిన 73సర్వేనంబరు గల రెండుఎకరాల ఏడుగుంటల భూమిని కలుపుకొని మొత్తం 4ఎకరాల 15గుంటలను ఇదే గ్రామానికి చెందిన ఈర్లపల్లి రాములు అలియాస్, చిన్న రాములు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. అక్రమ పట్టాచేసుకున్న రాములతోపాటు అప్పటి తహసీల్దార్ రాజగోపాలరావు, వీఆర్వో రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ పట్టాచేసుకున్న ఈర్లపల్లి రాములును అదుపులోకి తీసుకోగా, రిటైర్డ్ తహసీల్దార్ రాజగోపాల్ రావును, వీఆర్వో రాజేష్‌ను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

తప్పుడు పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లంతకుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కమటం శ్రీధర్ వాట్సాప్‌లో, ఇదే గ్రామానికి చెందిన పసుల బాబు ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యే పాతవీడియోలను ఎడిట్‌చేసి పెట్టారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన వీరిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభ్యంతరకరంగా పోస్ట్ పెట్టిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్ళపల్లి మండల తహసీల్దార్‌పై అసభ్యకరంగా వాట్సాప్‌లో పోస్ట్‌పెట్టిన నక్క నరేష్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. అసభ్యకరమైన పోస్టులుపెడుతూ విధులకు ఆటంకపరిచేవిధంగా, ప్రజలలో ఉద్యోగులపై చులకన భావం ఏర్పడేవిధంగా చేశాడని తహసీల్దార్ జయంత్ కుమార్ ఫిర్యాదుచేశారు. కేసునమోదు చేసుకొని పోస్ట్‌చేసిన మండెపల్లి గ్రామానికిచెందిన నక్కనరేష్ మొబైల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా, వర్గాల మధ్య రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో వీడియోస్ గాని, అసభ్యకరమైన, రెచ్చగొట్టేరాతలు రాసి పోస్టులు పెడితే వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

తిమ్మాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ రిజర్వాయర్ సమీపంలోగల పంటపొలాలవద్ద నెమలి విద్యుత్‌దాఘాతంతో మృతిచెందింది. గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ నెమిలి ఎగిరేక్రమంలో పక్కనే ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌వైర్లకు తాకి షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు.

చికెన్ సెంటర్‌లో కోళ్లు చోరీ

శంకరపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలోని ఓ చికెన్‌సెంటర్‌లో కోళ్లు చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్‌రజాక్ చికెన్‌సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటిముందు ఇనుపజాలి బాక్స్‌లో 20కోళ్లు ఉంచాడు. మంగళవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు జాలితాళాలు పగలగొట్టి కోళ్లు ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయాడు. వీటి విలువ రూ.8వేల వరకు ఉంటుందని తెలిపారు. చోరీపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అందమైన చేతి రాత బంగారు భవితకు బాట



● విద్యార్థులు దృష్టి సారిస్తే అధిక మార్కులు ● రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

వెల్గటూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్షరం విలువ తెలపడానికి మన భావాన్ని స్పష్టంగా వ్యక్తం చేయడానికి అందమైన చేతి రాత అవసరం. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. చదవడం ఎంత ముఖ్యమో ఎలా రాశామనేది కూడా అంతే ముఖ్యం. అందుకే విద్యార్థులు చేతి రాతపై అవగాహన పెంచుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు. శుక్రవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు అధిక మార్కులు సాధించడానికి ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

అందమైన చేతి రాతతో ఉత్తమ ఫలితాలు

అందమైన చేతి రాత ఉంటే పరీక్షల్లో అధిక మార్కులు సాధించవచ్చు. కానీ సాంకేతికత పుణ్యమా అని.. ఆయుధం లాంటి అక్షరం అష్టవంకర్లు పోతోంది. కంప్యూటర్లు, ట్యాబ్‌లు, సెల్‌ఫోన్‌ల కారణంగా చేతి రాతపై అంతగా దృష్టి సారించడం లేదు. చాలా మంది విద్యార్థులు గుండ్రంగా రాయలేక పోవడం ఆందోళన కలిగించే అంశం. అక్షరాలు అందంగా, స్పష్టంగా రాస్తే పరీక్ష పేపర్లు దిద్దే వారిలో రాసే అంశంపై పాజిటివ్ దృక్పథం కలిగి మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది.



చేతి రాత సాధన చేస్తున్న కుమ్మరిపల్లి కేజీబీవీ పదో తరగతి బాలికలు

మారిన పరీక్ష విధానం

పదో తరగతిలో ఈ ఏడాది పరీక్ష విధానం మారింది. గతంలో ఆరు సబ్జెక్టులకు పదకొండు పేపర్లు ఉండేవి. కానీ ఈ ఏడాది దానిని ఏడు పేపర్లకు కుదించారు. గతంలో సమా ధాన పత్రాలు విడిగా ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఒకేసారి 24 పేజీల సమాధాన పత్రం ఒకేసారి ఇస్తారు. దీనితో విద్యార్థులు ఆందోళనకు గురి కాకుండా మొత్తం పేజీలు ఒకే విధంగా చేతి రాత ఉండేలా చూసుకోవాలి. విద్యార్థులు చేతి రాత మీద ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధిస్తారనడంలో ఎలాంటి సందదేహం లేదు. విద్యార్థులు చేసే చిన్న చిన్న తప్పులకు మార్కుల్లో కోత పడే అవకాశం ఉంది. అక్షర దోషాలు, వ్యాకరణ దోషాలు, చేతి రాత స్పష్టంగా లేక పోవడంతో మార్కులకు కోత పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చేతి రాత బాగా లేని కారణంగా చాలా మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించలేక పోతున్నారు.

చేతి రాతపై దృష్టి సారించాలి

రంగ శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయుడు



పదో తరగతి విద్యార్థులు చేతి రాతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రాసేటప్పుడు కూర్చునే భంగిమ, పెన్ను పట్టుకునే విధానం చేతిరాతపై ప్రభావం చూపుతుంది. తెలుగులో అక్షరాలు గుండ్రంగా ముత్యాలను తలపించేలా ఉండాలి. చేతి రాతను బట్టి మార్కుల సాధన ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలి. చేతిరాతపై పిల్లలతో పాటు తల్లిదండ్రులు దృష్టి సాధించాలి.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఏఎస్ఐ నారాయణ ఆధ్వర్యంలోని పోలీసులు సింగారం గ్రామ శివారులోని వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుకతో ట్రాలీ ఆటో వెళుతోందన్నారు. వాహనాన్ని ఆపి రవాణాకు సంబంధించిన పత్రాలను చూపాలని కోరడంతో అనుమతి పత్రాలు లేవన్నాడు. దాంతో ట్రాలీ ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ గండికోట వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని వెల్లడించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని ఆటోలో తరలిస్తున్న 10క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణకు సమాచారం రావడంతో కాపు కాచి బియ్యం పట్టుకున్నామని పేర్కొన్నారు. ఆటోతో పాటు బియ్యం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. నారాయణపూర్‌లోని అనరాసి దేవరాజు తన ఆటోలో బియ్యంను తరలిస్తున్న పట్టుబడ్డాడని పేర్కొన్నారు. గ్రామాల్లోని లబ్ధిదారులవద్ద నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని రైస్‌మిల్లు యజమాని లింగారావుకు విక్రయిస్తున్నానని విచారణలో వెల్లడించాడని తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

విద్యార్థి కిడ్నాప్ కలకలం

● గంటలో ఛేదించిన పోలీసులు

పెగడపల్లి, మార్చి 19 (ఆంధజ్యోతి): పెగడపల్లిలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థి కిడ్నాప్ కలకలం సృష్టించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో బాలుడిని తీసుకెళ్తున్న కారును వెంబడించి విద్యార్థిని కాపాడి, నలుగురు కిడ్నాపర్లను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సీహెచ్ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలం నందగిరి గ్రామానికి చెందిన అయిలవేని రంజిత్‌కుమార్ (16) మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల ముగించుకొని మధ్యాహ్నం స్నేహితుడైన శివరాత్రిశివకు చెందినబైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. విద్యుత్ ఉపకేంద్రం సమీపంలోని ప్రధానరహదారిపై కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని అడ్డగించారు. అనంతరం రంజిత్‌కుమార్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఈవిషయాన్ని రంజిత్‌కుమార్ స్నేహితుడైన శివ పాఠశాల ఉపాధ్యాయులతోపాటు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఎస్ఐ రవికిరణ్ కారును వెంబడించి నలుగురు కిడ్నాపర్లను పట్టుకున్నారు. నిందితులైన కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లికి చెందిన నవీన్ కుమార్, ఆరెపల్లి అనీల్, గసిగంటి వర్దన్, మైస అజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. కిడ్నాపర్లలో ఒకరైన నవీన్‌కుమార్‌కు చెందిన పెంపుడు కుక్కను దొంగలించాడనే అనుమానంతో రంజిత్‌కుమార్‌ను కిడ్నాప్ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. విద్యార్థి తండ్రి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ వివరించారు. కాగా కిడ్నాప్ కేసును గంటలోపే ఛేదించిన ఎస్ఐ రవికిరణ్, పోలీస్ సిబ్బంది వెంకట్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌ను ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

కూతురుతో చనువుగా ఉంటున్నాడని యువకుడిపై దాడి

● యువతి తండ్రితో పాటు పలువురిపై అట్రాసిటీ కేసు

మల్యాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తన కూతురుతో చనువుగా ఉంటున్నాడని ఓ యువకుడిని కారులో తీసుకెళ్లి కులం పేరుతో దూషించడమే కాకుండా దాడికి పాల్పడిన తండ్రితో పాటు పలువురు వ్యక్తులపై బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. మల్యాల మండలం బల్వంతాపూర్‌కు చెందిన జోగు పవన్ అనే యువకుడు పెగడపల్లి మండలం బతికెపల్లికి చెందిన యువతితో కొన్నాళ్లుగా చనువుగా ఉంటున్నాడని యువతి తండ్రి కొందరి సహాయంతో పవన్‌ను ఆదివారం మల్యాల నుంచి కారులో బతికెపల్లి శివారుకు తీసుకెళ్లారు. అక్కడ కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడుతూ చంపుతామని బెదిరించినట్లు పవన్ తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువతి తండ్రితో పాటు దాడికి పాల్పడిన వారిపై కేసునమోదు చేయగా డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలంరవి మల్యాల, బతికెపల్లిలో బుధవారం విచారణ జరిపారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దేవుని గుట్టతండాలోని అంగోతు కైక గుడిసె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుధవారం దగ్ధమైంది. ఇంటిలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఆమె కొడుకు గణేశ్‌కు సంబంధించిన విద్యా ధ్రువీకరణ పత్రాలను కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అప్పటికే గుడిసెతో పాటు బియ్యం, దుస్తులు, సామగ్రికాలిపోయింది. సుమారు రూ.2లక్షలనష్టం వాటిల్లింది. విద్యుతు స్తంభం నుంచి వచ్చే కరెంటుతీగ రాపిడిజరిగి ప్రమాదం చోటు చేసుకుందని అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్‌లు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్‌లు చేరుకుని ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని దిగువమానేరు జలాశయంలో బుధవారం సాయంత్రం ఓవృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. డ్యాంలో ఓవృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డ్యాంలో మృతదేహం, సమీపంలో బ్యాగును గుర్తించారు. అందులోని ఆధార్‌కార్డు దాని ఆధారంగా మృతురాలు చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికిచెందిన అందే మల్లవ్వ (77)గా గుర్తించారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఎన్టీపీసీలో 12 కిలోల గంజాయి పట్టివేత

జ్యోతినగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ ప్రాజెక్టు మెటీరియల్ గేటు సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం కారులో తరలిస్తున్న 12 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. రాజీవ్ రహదారిపై ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో కారులో రవాణాచేస్తున్న గంజాయిని పట్టుకొని నిందితుడు మాలమల్లేశం(33)ను అదుపులోకితీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు అటవీప్రాంతంలో మల్లేశం గంజాయిని కొనుగోలు చేసి కొత్తగూడెం, ములుగు జిల్లా మీదుగా ఎన్టీపీసీకి కారులో వచ్చాడని ఎస్ఐ ఉదయ్ తెలిపారు. ఎన్టీపీసీ ప్రాంతంలోని లేబర్ కాలనీలో కొంతగంజాయి విక్రయించి తిరిగి కరీంనగర్‌కు చెళ్లాలని మల్లేశం భావించాడని, వాహనాల తనిఖీలోపట్టుబడ్డాడని ఎస్ఐచెప్పారు. నిందితుడినుంచి12కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



గంజాయిని సీజ్ చేస్తున్న ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్

పన్నుల వసూళ్లలో హుజూరాబాద్, జమ్మికుంట మొదటి స్థానం



హుజూరాబాద్‌లో విజయకేతనం చూపిస్తున్న మున్సిపల్ సిబ్బంది

● తైబజార్‌కు రూ. 16.40లక్షలు

హుజూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ ఇంటిపన్నుల వసూళ్లలో మొదటిస్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. బుధవారం హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం వంద శాతం ఇంటిపన్నుల వసూళ్లు చేసి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచామన్నారు. రాష్ట్రంలో 143 మున్సిపాలిటీలు ఉండగా హుజూరాబాద్ మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. మున్సిపాలిటీలోని 30వార్డుల్లో 8917నివాసాలు ఉండగా, రూ.2.64కోట్లబకాయిలు ఉన్నాయన్నారు. రెండు నెలలలుగా సిబ్బందితో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి వంద శాతం ఇంటిపన్నులు వసూళ్లు చేశామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా, పోలీస్‌శాఖ నుంచి రూ.5.41లక్షలు, కోర్టు బిల్డింగ్‌ల ద్వారా రూ. 3.80లక్షలు, ఎంపీడీవో కార్యాలయం ద్వారా రూ.1.18లక్షలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రూ.1.18లక్షల చెల్లింపు జరిగాయన్నారు. వంద శాతం పన్నులు వసూళ్లు జరిగినందున 15వ ఆర్థిక సంఘం నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు సత్వరమే వచ్చే అవకాశాలున్నాయన్నారు. పట్టణ ప్రజలు వందశాతం పన్నులు చెల్లించి మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్ మున్సిపాలిటీలోని తైబజార్ బహిరంగ వేలం ద్వారా రూ.16.40లక్షలకు వేలంపాట ద్వారా నిధులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. బహిరంగ వేలంలో ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా, రామకృష్ణ అనే అతడు వేలం ద్వారా పాటలో చేజిక్కించుకొ న్నాడు. గత సంవత్సరం రూ.15.55లక్షలు రాగా, ఈఏడాది రూ. 16.40 లక్షలు వచ్చాయి.

జమ్మికుంట మున్సిపాలిటీ..

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపాల్టీ ఆస్తిపన్నులు వందశాతం వసూళ్లు చేసి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచిందని కమిషనర్ ఎండీ ఆయాజ్ తెలిపారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్‌పరిధిలో చేపట్టిన ఆస్తిపన్నుల బకాయిల వసూళ్లలో కమిషనర్ స్వయంగా పాల్గొన్నారు. వందశాతం పూర్తిఅయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ప్రతి ఒక్కరు సహకరించడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు కమిషనర్‌ను అధికారులు, సిబ్బంది కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ నరేష్, టీపీవో శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం ఉద్యమించాల్సి వస్తుందనుకోలేదు



తిమ్మాపూర్‌లో దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే కోరుకంటి చందర్

● రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

సుభాష్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మళ్లీ నీళ్లకోసం ఉద్యమించాల్సిన పరిస్థితి వస్తుందనుకలేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం కాళేశ్వరం ప్రాజెక్టు విశిష్ఠతను వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ రామంగుండం నుంచి ఎర్రవెల్లిలోని కేసీఆర్‌ఫాంహౌజ్ వరకు చేపట్టిన పాదయాత్రలో భాగంగా కరీంనగర్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గోదావరిని ఎండగొట్టారని అన్నారు. రైతుల పట్ల కక్ష్య సాధింపుదోరణి విడనాడాలని ఈ పాదయాత్ర చేపట్టానని అన్నారు. కేసీఆర్ హయాంలో గోదావరి ఎలా నిండుకుండలా ఉన్నదో అలాగే నింపాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సుడా మాజీచైర్మెన్ జీవీ రామకృష్ణారావు, చల్ల హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా ఉన్న గోదావరిని ఎండబెట్టారు

తిమ్మాపూర్: నిండుకుండాల ఉన్న గోదావరిని ఎండబెట్టారని, ఫలితంగా రైతుల పంటలు ఎండుతున్నాయని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. 'గోదావరి కన్నీటి గోస' అనే నినాదంతో కోరుకంటి చందర్ చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం తిమ్మాపూర్ మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి ఎండిపోయి 15నెలలు అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కూడా 15నెలలు అవుతుందని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు 10 ఏండ్లు గోదావరి నిండుకుండాల ఉందన్నారు. ఇప్పుడు ఎడారిలా మారడంతో నీరులేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. దీంతో రైతుల కష్టాన్ని తెలియజేసేందుకు, ఎండిపోయిన గోదావరి నుంచి, కొండ పోచమ్మసాగర్ వరకు 180కిలోమీటర్ల వరకు రైతులతో కలసి మండు టెండలో పాదయాత్ర చేస్తున్నాం అని అన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే తప్ప ప్రభుత్వం కదిలే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏవిధంగా పరిపాలన అందిస్తుందో ఇప్పుడు ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వపతనం తప్పదని హెచ్చరించారు.

ముసుగులు తొడిగి ఉంచడం సిగ్గుచేటు..

మహనీయులైన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ లాంటి వారి ప్రతిమలు కనిపించకుండా ముసుగులలో ఉంచడం అనేది సిగ్గుచేటు అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాల ముసుగులు తొలంగించి వెంటనే ఆవిష్కరించాలని డిమాండ్ చేస్తూ 10 రోజులుగా తిమ్మాపూర్ మండల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలేనిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్, జేఏసీ నాయకులు దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, ప్రజలు పాల్గొన్నారు.

పిచ్చుకా.. క్షేమమా..



కరీంనగర్ క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పిచ్చుకల కిలకిలరావాలు ఇష్టపడనివారు ఉండరు. తెల్లవారుతుండగానే కిచకిచమంటూ సంగీతాన్ని వినిపించేవి. పంట చేలల్లో, ఇళ్ల ముంగిట వేలాడ దీసిన వరి గొలుసులు తింటూ సందడి చేసేవి. ప్రస్తుతం మానతప్పిదాలు, వాతావరణ మార్పులతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. పెరుగుతున్న టెక్నాలజీ వాటికి శాపమవుతోంది. సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్, ఫ్యాక్టరీల కాలుష్యం కారణంగా పిచ్చుకలు, పొలాల్లో తిరిగే ఇతర పక్షులు కనిపించకుండా పోతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. అంతరించే దశలో ఉన్న పిచ్చుకలతోపాటు ఇతర పక్షులను రక్షించుకోలేక పోతే భవిష్యత్ తరాలకు ఇలా ఉంటాయని బొమ్మల ద్వారా చూపించే పరిస్థితి నెలకొంటుంది. మనతో కలసి జీవిస్తూ, పర్యావరణ సమతుల్యాన్ని, జీవవైవిధ్యాన్ని, సమగ్రతను కాపాడే పిచ్చుకలను కాపాడుకోవడం అందరం కర్తవ్యంగా భావించాలి. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడకపోతే భవిష్యత్ అంధకారమే. దీనిపై ప్రభుత్వాలు, పాలకులు స్వచ్ఛంద సంస్థలు పౌరులు స్పందించాలి. పిచ్చుకల సంరక్షణ కోసం నడుం బిగించాలి.

పిచ్చుకలు పర్యావరణ హితాలు

పరిమాణంలో పిచ్చుక చిన్నదైనా ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థకు ఎంతగానో సహకరిస్తాయి. పండ్లు, కాయల్లోని విత్తనాలు తిని వాటిని ఇతర ప్రాంతాల్లో విసర్జించడం ద్వారా ఆ ప్రాంతంలో కొత్త మొక్కలు వ్యాప్తి చెంది పర్యావరణంలో పచ్చదనం పెరిగి భూతాపాన్ని అదుపు చేయడానికి పరోక్షంగా సహకరిస్తాయి. పుష్పాల ఫలదీకరణ, పరాగసంపర్కం వంటి ప్రక్రియల ద్వారా కొత్త విత్తనాలు ఏర్పడడంలో పిచ్చుకల పాత్ర కీలకం. అదే సమయంలో పిచ్చుకల విసర్జకాలు భూమికి ఎరువుగా ఉపయోగపడి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి రైతులకు సాగు వ్యయం భారం కాకుండా సహకరిస్తాయి. పంట చేలల్లో విత్తనాలు, ధాన్యంతోపాటు చిన్న చిన్న కీటకాలు, దోమల లార్వాను ఆహారంగా తీసుకుంటాయి. పిచ్చుకలు తగ్గడంతో లార్వా పెరిగి దోమలు వృద్ధి చెంది నేడు వైరల్, డెంగ్యూ, మలేరియా జ్వరాలూ విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం కొందరు పాత సంప్రదాయాలను గౌరవిస్తూ ఇళ్ల ముంగిట వరి కంకులు కడుతున్నా వాటిని తినడానికి పిచ్చుకలు కనిపించక పోవడం బాధాకరం.

- వినిపించని కిలకిలారావాలు
- ప్రశ్నార్థకంగా మనుగడ
- అంతరించిపోతున్న జాబితాలోకి బుజ్జిపిట్ట
- కాలుష్యం, రేడియేషన్, చెట్ల నరికివేతతో ముప్పు
- నేడు అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం

తగ్గడానికి కారణాలు

సెల్‌ఫోన్ సిగ్నల్స్ తీవ్రత(రేడియేషన్) అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఊరపిచ్చుకలు మనుగడ సాగించ లేవని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఆ టవర్ల నుంచి వెలువడే విద్యుదయస్కాంత తరంగాలు పిచ్చుకలను తరిమేస్తున్నాయని తాజాగా చేపట్టిన పరి శోధనల్లోనూ తేలింది. గాలి కాలుష్యం పెరిగిపోవ డంతో కూడా పిచ్చుకలు తమ సంతాన ఉత్పత్తి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. ఓవైపు పంటలు పండే భూ విస్తీర్ణం తగ్గి పోవడం, మరో వైపు సాగులో విచ్చల విడిగా రసాయనాలు, క్రిమిసంహారక మందులు ఉపయోగించడంతో ధాన్యాన్ని, పండ్లను ఆహారంగా తీసుకుంటున్న పిచ్చుక జాతి అంతరించిపో తోందని వివిధ పరిశోధనల్లో స్పష్టమైంది. కాలుష్యం, రేడియేషన్, చెట్లనరికివేత వంటి పరిణామాలతో భూతాపం పెరిగి వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

పరిరక్షణకు చర్యలు

పిచ్చుకలకు అనుకూలమైన ఆవాసాలను సృష్టించాలి. పక్షి ఫీడర్లు, నీటి వసతులు ఏర్పాటు చేయాలి. చెట్లపొదలను నాటడం, సాగులో పురుగుమందు వాడకాన్ని తగ్గించడం వంటివి కొంత వరకు వాటి మనుగడకు మేలు చేస్తాయి.

నేపథ్యం

ఏటా మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం జరుపుకుంటున్నాం. భారతీయ ప్రకృతి పరిరక్షకుడైన మహమ్మద్ దిలావార్ పిచ్చుకల పరిరక్షణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. నేచర్ ఫర్ సొసైటీ అనే సంస్థను స్థాపించాడు. తద్వారా అనేక రకాలుగా పిచ్చుకలను రక్షించడానికి వీలైన అవకాశాల్ని అందరితోనూ పంచుకున్నాడు. ఈ సందర్భంలో పిచ్చుకల మనుగడ కష్టమైతే మానవుల మనుగడకే ప్రమాదమని గుర్తించిన ప్రపంచదేశాలు అంతరించి పోతున్న పిచ్చుకలను కాపాడుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

ఇందులో భాగంగా నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఫ్రాన్స్‌కు చెందిన ఎకో-సిస్ యా క్షన్ ఫౌండేషన్, ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ దినోత్సవం నిర్వహించాలనే లక్ష్యంతో ఏటా మార్చి 20వ తేదీన పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. మొట్టమొదటగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2019 మార్చి 20వ తేదీన నిర్వహించారు. ఏటా ఈ రోజున ఒక ప్రత్యేక థీమ్‌తో పిచ్చుకల సంరక్షణపై చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. పిచ్చు కల జీవన విధానం, వాటికి ఉన్న అను కూల వాతావరణ పరిస్థితులు, అవి అంతరించి పోవడానికి గల కారణాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరో వైపు ప్రపంచంలో ఏటా పిచ్చుకల సంఖ్య తగ్గి పోతుండడంపై ఐక్యరాజ్య సమితి స్పందించింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ తయారు చేసిన రెడ్ జాబితాలోకి వాటిని చేర్చింది. దీనిని బట్టి పిచ్చుకల మనుగడ ఏ స్థాయికి పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు. దేశంలో పిచ్చుకలను సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే ఢిల్లీ, బీహార్ ప్రభుత్వాలు రాష్ట్ర పక్షిగా ప్రకటించాయి.



కరీంనగర్‌లో పిచ్చుకల కోసం చేసిన ఏర్పాట్లు

పార్లమెంట్‌లో బిల్లులు ఆమోదం పొందడానికి రాజకీయ పార్టీలన్నీ ముందుండాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



రైతుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ఆమోదించిన ఎస్సీ బీసీ రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో వెంటరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ బీసీ రిజర్వేషన్ల బిల్లులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసి బడుగు బలహీన వర్గాల ప్రజలను సమన్వయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రభుత్వం ఆమోదించడంపై సీపీఐ పక్షాణ హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమానికి వారి ఆశయాలు నెరవేరే విధంగా రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోయిని అశోక్, జిల్లా కార్యవర్గసభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, అనిల్ పాల్గొన్నారు.

రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి

ఇల్లంతకుంట : రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే తీర్చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో ఇల్లంతకుంట, తంగళ్ళపెల్లి మండలాలకు చెందిన రైతులు ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తి చేయాలని చేపట్టిన నిరాహారదీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస రామానుజన్ గణిత ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు సాయి సృజిత్ రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. సాయిరిషిత్ జిల్లా స్థా యి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో విజేతలకు తెలంగాణ రాష్ట్ర ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లావిడియా చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారన్నారు.



పతకాలతో విద్యార్థులు

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ చేయాల్సిందే..

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

తిమ్మాపూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ చేయాల్సిందేనని, అందుకోసం ఎంతకైనా సిద్ధమేనని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో పదిరోజులుగా చేస్తున్న రిలేనిరాహార దీక్షకు మద్దతుగా ఆయన పాల్గొని సంఘీబావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అక్కడ కూడా పరిష్కరం కాని పక్షంలో సీఎంని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాను జిల్లాకు వస్తున్నట్లు ముందస్తుగా జిల్లా పోలీసులకు, అధికార వ్యవస్థకు సమాచారం అందించినా నిర్లక్ష్యంగా ప్రొటోకల్‌ను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ఎస్కార్ట్ లేకుండా స్వయంగా ఒక్కడినే ఇక్కడికి వచ్చానని అన్నారు. కరీంనగర్ జిల్లాలో పోలీస్‌వ్యవస్థ ఎంత దౌర్భాగ్యమైన స్థితిలో ఉందో అర్థమౌతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని అవమానంగా భావిస్తున్నా అని మండిపడ్డారు. విగ్రహాల ముసుగు తొలగించేందుకు ఏప్రిల్ నెల వారికి డెడ్‌లైన్ పెడుతున్నట్లు హెచ్చరించారు. విగ్రహాల ఆవిష్కరణ కావల్సిందేనని లేనిపక్షంలో రాష్ట్ర సమస్యగా పరిగణలోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని వెంకటయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుంద్ర రాజయ్య, మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, ఎలుక ఆంజనేయులు, మేడి అంజయ్య, వంతడుపుల సంపత్, పార్నంది జలపతి, కోయడ మురళి, శంకర్, తిరుపతిరెడ్డి, గడ్డం అరుణ్, అశోక్ పాల్గొన్నారు



తిమ్మాపూర్‌లో దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బక్కి వెంకటయ్య

వేములవాడ, ధర్మపురిలో వైభవంగా రథోత్సవాలు



ధర్మపురిలో

వేములవాడ కల్చరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి శివకల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారలను ప్రత్యేకంగా అలంకరించి రథాల మీద కొలువుదీరిన అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో పుర వీధులు మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయాయి. రథోత్స వంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రముఖులు హాజరై డప్పుచప్పుళ్ల, డీజే సౌండ్స్ మధ్య నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు.

కొనసాగుతున్న శివకల్యాణోత్సవం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నాలుగో రోజు బుధవారం శివకల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6.30 గంటల నుంచి తీర్థరాజస్వామి పూజ, ఔపాసనము- బలిహరణముతో పాటుగా ఏకాదశ రుద్రహావనము నిర్వహించారు. సాయంత్రం 3.05 గంటల నుంచి స్వామి వారి రథోత్సవము, సాయంత్రం 4 నుంచి శివమహాపురాణ ప్రవచనము రాత్రి 6.30 గంటలకు ఔపాసనము- బలిహారణము, రాత్రి 8.30 గంటలకు శృంగార వసంతోత్సవము కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు.



వేములవాడలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయంలో ప్రముఖులు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చ కులు స్వస్తితో స్వాగతం పలుకగా బీజేపి సీనియర్ నేత ప్రతాప రామకృష్ణ అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు స్వామి వారిని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాత్యాయని దర్శించుకున్నారు.

ధర్మపురిలో నృసింహుడి..

ధర్మపురి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. స్వామివారల రథాలను పురవీధుల గుండా చింతామణి చెరువు గట్టు వరకు ఊరేగింపు జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీ ఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తొమ్మిదో రోజు ఆదాయం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయానికి రూ.3,15,503 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్ తెలిపారు. వీటిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ., 11,208, ప్రసాదాల విక్రయం ద్వారా రూ 84,375, అన్నదానం కోసం భక్తులు రూ.1,19,920 విరాళాలు సమర్పించినట్లు వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో గురువా రం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి 9 గం టలకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ) ఏకాంతోత్సవం ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శేషప్ప కళా వేదికపై రాత్రి 6-30 గంటల నుంచి 7-30 వరకు ధర్మపురి పట్టణానికి చెందిన కుమారి సామ శివాని బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 7-30 నుంచి 9 గంటల వరకు మద్వాచారి పవన్ కుమార్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి పూజలు

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమలై అంజిరెడ్డి దంపతులు బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే గోదావరి పుష్కరాల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు.

మల్యాల: ఎమ్మెల్సీ అంజిరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వేములవాడ స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



పంట కోసం పాట్లు

- ట్యాంకర్ ద్వారా పొలాలకు నీరందిస్తున్న రైతు



ట్యాంకర్ ద్వారాబావిలో నీటిని నింపుతూ..

హుజూరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సాగు నీరు అందక పంట ఎండిపోతుండటంతో రైతులు నానా పాట్లు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకువచ్చి పొలాలు పారిస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెం దిన అపరాధ మహేష్, అతని తండ్రి శ్రీనివాస్‌లకు ఐదెకరాల పొలం ఉంది. యాసంగిలో బావుల్లో, బోర్లలో ఉన్న నీటిని చూసి పూర్తి స్థాయిలో నాటు వేశాడు. మెట్ట ప్రాంతం కావడంతో పంట చేతికచ్చే సమయంలో బోర్, బావుల్లో నీరు అడు గంటి పోయాయి. పంటను కాపాడుకు నేందుకు ఎస్సారెస్పీ ఆయకట్టు పక్కన ఉన్న ఓ రైతు వద్ద రూ. 10వేలకు నీటిని కొనుగోలు చేశాడు. ఈ నీళ్లను తనకు ఉన్న ట్రాక్టర్‌కు ట్యాంకర్‌ను ఏర్పాటు చేసుకొని సుమారు 5 కిలో మీటర్ల దూరం నుంచి తీసుకువచ్చి తన బావిలో పోస్తున్నాడు. ఆ నీటిని మోటర్ ద్వారా పొలాన్ని తడుపుతున్నాడు. వారానికి మూడుసార్లు ఇలా చేస్తున్నాడు.. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉంది. మరో 20రోజుల వరకు ఇలానే ట్యాంకర్ల ద్వారా నీరు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని రైతు అపరాధ మహేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దేవాదుల ప్రాజెక్టుకు చివరి ఊరైన దమ్మక్కపేటకు ఇప్పటి వరకు ఒక చుక్క నీరు రావడం లేదు. ఈ ప్రాజెక్టు నిర్మించి 15 ఏళ్లు అవుతున్న ఏరోజు నీళ్లు రాలే దు. ఇలా చాలా మంది రైతులు పంటలను కాపాడడం కోసం అదనంగా ఖర్చు చేస్తూ ఆర్థికంగా చితికి పోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పంటలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ట్యాంకర్ ద్వారా నీటిని బావిలో నింపుతున్న మహేష్

పంటలను కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నాం
అపరాధ మహేష్, రైతు, దమ్మక్కపేట

యాసంగిలో పంటలు పండుతాయనే ఉద్దేశ్యంతో ఐదెకరాల నాటు వేశాను. పంట చేతికచ్చే సమయంలో బావి, బోర్‌లో నీరు అడుగంటి పోయాయి. ఎస్సారెస్పీ ఆయకట్టు పక్కన ఓ రైతు వద్ద రూ. 10వేలకు నీటిని కొనుగోలు చేశాను. నాకున్న ట్రాక్టర్‌కు ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి వారానికి మూడుసార్లు నీటిని తరలించి పంటను కాపాడుకుంటున్నాను. మా ఊరికి దేవాదుల ప్రాజెక్టు ఉప కాలువ ఉన్నా ఒక్కరోజు కూడా నీళ్లు రాలేదు. దేవాదుల నీటి గురించి ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోవడం లేదు.

గేట్‌లో ప్రతిభ కనబర్చిన లిఖిత

జాతీయస్థాయిలో 70వ ర్యాంకు



ఇల్లంతకుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన దొడ్ల లిఖిత గేట్‌లో జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు సాధించింది. ప్రస్తుతం లిఖిత ఢిల్లీలో డీఆర్‌డీఏలో ఉద్యోగం చేస్తోంది. దొడ్ల దేవేందర్, రేఖల చిన్న కుమార్తె అయిన లిఖిత, చొప్పదండిలోని నవోదయలో చదివింది. అనంతరం హైద్రాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసింది.

23న తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఎన్నికలు

పెద్దపల్లి టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సహకార సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికలు ఈ నెల 23న రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్ మోహన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా స్వర్ణగిరి దేవాలయంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కోశాధికారి డా. సముద్రాల విజయ సారధి ప్రకటించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశా ధికారి పదవులకు జరిగే ఎన్నికల్లో సంఘ సభ్యులు విధిగా పాల్గొనా లని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికలకు సంఘం సభ్యులు హాజరు కావాలని కోరారు. ఎన్నికల నిర్వహణ అధికారి దేశపతి రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామగుండం టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు

కోల్‌సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సింగరేణి ఎస్అండ్‌పీసీ అధికారులపై మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గోదావరిఖని శివాజీనగర్‌లోని ఇ.నెం.16-2-54/ఎ/1 ఇంటిని కూల్చే సమయంలో ఇంటి యజమాని, మాజీ కార్పొరేటర్ జనగామ సరోజినిని కులం పేర దూషించి, దుర్భాషలాడిన ఫిర్యాదుపై కేసు నమోదు అయింది. అభివృద్ధి పేరుతో నోటీసులు కూడా ఇవ్వకుండా ఇంటిని కూలగొట్టడం సరికాదని అడ్డుకున్న సరోజినిని కులం పేర దూషించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 15న జరిగిన సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో మొత్తం 16మందిపై కేసు నమోదైంది. సంఘటనపై జనగామ సరోజన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వీరితో పాటు ఇందుకు ప్రోత్సహించిన సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టాలిచ్చారు.. హద్దులు మరిచారు

● శ్రీరాంపూర్‌లో మాస్టిన్ కులస్తుల ఆవేదన

కాల్వశ్రీరాంపూర్, మార్చి 19,(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పట్టాలిచ్చి హద్దులు చూపించలేదని మండలంలోని కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన మాస్టిన్ కులస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ గత ప్రభుత్వంలో ఆగస్టు 2023న భూమిలేని వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి లేని కారణంగా తారుపల్లిలో సర్వేనం 425లో కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన 14మంది దళితులైన నిరుపేదలకు ప్రతి ఒక్కరికి 75గజాల స్థలం ఇచ్చారు. వీరికి తహసీల్దార్ నివేశనస్థలాల కేటాయింపు పత్రం అందజేశారు. తారుపెల్లిలో వారు నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించగా అక్కడి గ్రామస్థులు అడ్డుకుంటున్నారని మాస్టిన్ కులస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే కాల్వశ్రీరాంపూర్‌లో 597సర్వే నంబర్లు పాండవుల గుట్టపై గ్రామంలో నివాసం లేని వారికి గతంలో తహసీల్దార్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎకరాలకు ఎకరాలు పట్టాలిచ్చారని, అయినా మా గ్రామస్థులు ఎవరూ అడ్డుకోలేదని మాస్టిన్ కులస్తులు తెలిపారు. 597సర్వే నంబర్ పాండవుల గుట్టపై పక్క గ్రామాల వారికి చేసిన పట్టాలను రద్దుచేసి కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన నిరుపేద షెడ్యూలు కులాలకు వారికి నివేశన స్థలాల కోసం పట్టాలివ్వాలని నిరుపేదలు కోరుతున్నారు. దళితులకు పట్టాలు ఇచ్చిన విషయం తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. పరిశీన చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.



నివేశన స్థలాల పత్రాలతో మహిళలు

జాగ చూపించి ఇల్లు మంజూరు చేయండి

దంతనపెల్లి స్వామి, మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

దళితులైన మాస్టిన్ ఇల్లులేని నిరుపేదలకు అప్పటి ప్రభుత్వం 2023లో తారుపల్లిలో ఇల్లు కట్టుకునేందుకు నివేశ స్థలాలు ఇచ్చింది. తారుపల్లి గ్రామస్థులు అడ్డుకోవడంతో పేదలకు గూడు లేకుండా పోతోంది. కాల్వశ్రీరాంపూర్‌లో ప్రభుత్వం నివేశ స్థలాలు ఏర్పాటు చేసి వారికి ఇళ్లు మంజూరు చేయాలి.

ప్రభుత్వం న్యాయం చేయాలి

దంతనపల్లి ప్రమీల,కాల్వశ్రీరాంపూర్

నిరుపేద దళిత మాస్టిన్ కులస్తులమైన మాకు ఉండేందుకు ఇల్లులేదు. తారుపల్లిలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు అక్కడి గ్రామస్థులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి. ఉండేందుకు ఇల్లులేక బంధువుల స్థలంలో గుడిసె వేసుకొని ఉంటున్నాం. మా గ్రామంలో 597సర్వే నంబర్‌లో ఇంటి స్థలాలు మంజూరు చేయాలి.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట

● బడ్జెట్‌పై అభిప్రాయాలు

అన్ని వర్గాలకు సమ న్యాయం

చింతకుంట విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమ న్యాయం చేసే విధంగా ఉంది. వ్యవసాయానికి, మహిళలకు, ఆరు గ్యారంటీ పథకాలకు పెద్ద పీట వేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేశారు. యువ వికాసం పేరిట 6 లక్షల మంది నిరుద్యో గులకు లబ్ధి చేకూర్చేలా బడ్జెట్ ఉంది. ఇందిరమ్మ ఇళ్లకు కూడా నిధులు పెద్ద ఎత్తున కేటాయించడం శుభసూచకం.

ప్రజా రంజక బడ్జెట్

- రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, రామగుండం ఎమ్మెల్యే



ప్రభుత్వం తీసుక వచ్చిన 2025-26 బడ్జెట్ ప్రజా రంజక, ప్రజాపాలన బడ్జెట్. కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా, ప్రభుత్వం కష్టకాలంలో ఉన్నా కూడా రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని 3 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అన్ని వర్గాల ప్రజలకు పెద్దపీట వేశారు. ఉద్యోగాల కల్పన, నీటి పారుదల, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య రంగానికి సరిపడా నిధులు కేటాయించారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అడుగులు పడుతున్నాయి.

420 హామీల ప్రస్తావన ఏదీ..

- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు



ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. గత బడ్జెట్‌లో ఆయా శాఖలకు కేటాయించిన నిధులనే వెచ్చించ లేదు. 3 లక్షల కోట్ల బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్టే. ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం, స్కూటీలు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ. 2500, పింఛన్ల పెంపు అంశాలు బడ్జెట్‌లో కానరావడం లేదు. ప్రజలను మోసం చేసే విధంగా బడ్జెట్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

కాగితాలకే పరిమితం

- కర్రె సంజీవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉత్త బడా యి బడ్జెట్. అందులో పస లేదు. అది కాగితాలకే పరిమితం కానున్నది. ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా లేదు. నిరుద్యోగ భృతి లేదు, తులం బంగారం లేదు. పింఛన్లు పెరగ లేదు. ఉచిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతున్నది.

యువతను విస్మరించిన ప్రభుత్వం

- తాండ్ర సదానందం, సీపీఐ జిల్లా కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం యువతను పూర్తిగా విస్మరించింది. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు ఇస్తామన్న హామీ నెరవేర్చలేక పోయింది. విద్యా రంగానికి గతంలో కంటే కేవలం 0.2 శాతమే నిధులు ఎక్కువగా కేటాయించారు. విద్య, వైద్యం, యువజన రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇచ్చే పరిస్థితి లేదు.

కార్మికులను విస్మరించిన బడ్జెట్

- ఎరవెల్లి ముత్యం రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది. పరిశ్రమలకు అతి తక్కువ బడ్జెట్ కేటాయించింది. కార్మికుల వేతనాల పెంపుపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల మంది కార్మికులకు వర్తించే 73వ షెడ్యూల్ కనీస వేతనాల జీవోల సవరణ, వేతనాల పెంపు ఊసే ఎత్తక పోవడం అన్యాయం.

అసమర్థ పాలనకు నిదర్శనం బడ్జెట్

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మంథని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శమని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌పై పుట్ట మధు బుధవారం ప్రకటన విడుదల చేశారు. యువవికాసం పథకంలో ప్రతి విద్యార్థికి రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ కార్యకర్తల జేబులు నింపే పథకంగా మార్చిందన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఇస్తామన్న ప్రతి నెల రూ. 2500 బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టలేదన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కార్మికుల శ్రమ దోపిడీ

కళ్యాణ్‌నగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పనిచేసే సెక్యూరిటీ, శానిటేషన్, స్కావెంజర్‌లకు ఎలైన్ సాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ తరుణ్ జీవో ప్రకారం జీతాలు ఇవ్వకుండా శ్రమ, ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారని ఏఐటీయూసీ రామగుండం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ జిల్లా సహాయ కార్మికశాఖ కమిషన్ ఎస్ వెంకటరెడ్డికి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రామగుండం నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు ఇప్పటికైనా జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ లైసెన్స్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు

ముత్తారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఖమ్మంపల్లి నుంచి మట్టి, ఇసుక అక్రమ రవాణా అనే శీర్షికపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష స్పందించి మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామస్థులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముత్తరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు, పంచాయతీ కార్యదర్శి,ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ఓదెల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ రమేష్ ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ లను కేటాయించిందని, విద్యార్థులు శ్రద్ధతో వినియోగించుకోవాలని ఎంఈఓ కోరారు. ఏఐ కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటుకు ఈ రెండు పాఠశాలలను ఎంపిక చేశారని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఏసుదాసు, లక్ష్మణస్వామి, ఏఏపిసి చైర్మన్ మాటూరి సుమలత పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

జ్యోతినగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు ఆటో డ్రైవర్స్ అ సోసియేషన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలలో ఐఎన్‌టియుసి జాతీయ నాయకడు బాబర్ సలీం పాషాను మరోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రంగినేని శ్రీరంగం, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ అజ్జు, జాయింట్ సెక్రెటరీగా కాసరబోయిన నర్సింహారావు, ఇతర కమిటీని ఎన్నుకున్నారు.

బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన రాచకొండ శంకర్ అనే ఆపరేటర్ ఇటీవల ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడగా ఆయనను బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం కృషి

మంథని, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చన ఎన్నికల హామీల అమలకు చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని కాంగ్రెస్ నేత శశిభూషణ్‌కాచే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, శాసన మండలిలో శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ రైతులు, నిరుద్యోగులు, పెద్దల బడ్జెట్‌గా ఉందన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

కోల్‌సిటీటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణను అలవర్చుకుంటూ విద్యలో రాణించాలని అప్పుడే మంచిస్థాయికి ఎదుగుతారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైతన్య మానవ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. రెవెన్యూ అధికారి కుమారస్వామి పరీక్షలు రాయడంలో మెళకువలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జీ సమీర్, పాత్రికేయులు దయానంద్‌గాంధీ, చైతన్య మానవ వేదిక సంస్థఅధ్యక్షులు కొప్పుల శంకర్, ప్రతినిధులు తౌటం సతీష్, జువ్వాజి శ్రీనివాస్, కొప్పుల నరేష్, ప్రదీప్‌కుమార్, ముష్కరవి తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని గర్రెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుల్తానాబాద్ మండల అభివృద్ధి అధికారి దివ్యదర్శన్‌రావు, మండల విద్యాధికారి రాజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల శిక్షణ శిక్షగా భావించ కూడదని, శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఎంఈఓ రాజయ్య మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు అందరూ చక్కగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోల్‌సిటీటౌన్: లివ్ ఫర్ క్రైస్ట్ మినిస్ట్రిస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లోని పదవతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జింక మల్లేశం, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కాసిపేట స్వామిదాస్, కర్రావుల తిరుపతి, కాసిపేట రిచర్డ్, మహేష్, అశోక్, కాసిపేట లింగయ్య, కాసిపేట జాన్, వినోద్, శకుంతల, శ్రీల, కాసిపేట అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు రమ, శాస్త్రి, అరుంధతి, పీడీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : ప్రతి విద్యార్థి శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి గుర్తింపు తేవాలని కమాన్‌పూర్, జూలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత అన్నారు. బుధవారం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులకు పోషకులు దండవేని రమేష్ పరీక్షలకు అవసరమైన స్టేషనరీ అందించగా పదవ తరగతి విద్యార్థులు 11వేల రూపాయల విలువైన ఆఫీసు బల్లలు పాఠశాలకు బహూకరించారు.

రామగిరి: పదవ తరగతి దశ విద్యార్థులకు కీలకమని అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ రఘురాం అన్నారు. బుధవారం మండలంలోని బేగంపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు మల్కారామ్ కిషన్‌రావు, కాంప్లెక్స్ హెచ్ఎం శోభన్‌బాబు, ఎంఈవో కొంరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సీఆర్‌పీ మల్లయ్యలు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: విలేజ్ రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటరెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ రాజు

రామగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మంథని సీఐ రాజు అన్నారు. బుధవారం రామయ్యపల్లి, ఆదివారంపేట్ గ్రామాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాలకు సీఐ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. గంజాయి సేవించి తమ జీవితాలను నాశనం చేసుకొవద్దని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా వాట్సాప్‌లలో వచ్చే మెసేజ్‌లను ఓపెన్‌చేయవద్దని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో గుడంబాలు, గంజాయి తాగినా అమ్మినా అమ్మిన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్ఐ చంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక

ముత్తారం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ముత్తారం మండల శాఖ నూతన అధ్యక్షులుగా లక్ష్మణ్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం ప్రకటించింది. ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ రాజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా. కే ప్రవీణ్, రాజేశ్వరి, జిల్లా కౌన్సిలర్‌లుగా మల్లయ్య, ప్రసుమతి మమత కార్యదర్శులుగా లక్ష్మణ్, విద్యాసాగర్, రమేష్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మమత ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం వృత్తి నిబద్ధత- సామాజిక బాధ్యత అనే నినాదంతో పనిచేస్తూ విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో మా వంతు కృషి చేస్తామని మండల విద్యాధికారి హరిప్రసాద్‌కు కమిటీ నివేదిక అందజేశారు.

ఖనిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

కోల్‌సిటీటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలోని ప్రభుత్వ శాఖ గ్రంథాలయాన్ని ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించారు. సమస్యలు తెలుసుకున్నారు. సింగరేణి ప్రాంతంలో వేలాది మంది యువత పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సురేందర్, రాణవేణి సుధీర్‌కుమార్, పోతరాజు నాగరాజు, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమ అధికారి ఉద్యోగానికి ఎంపిక

కమాన్‌పూర్, మార్చి 19,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రా నికి చెందిన బోధన ప్రత్యూషయాదవ్ వసతి గృహసంక్షేమ అధికారి ఉద్యోగానికి ఎంపికైంది. బోధన గట్టయ్య విజయలక్ష్మిలకు ముగ్గురు కుమార్తెలు. గట్టయ్య 2004లో మృతిచెందగా విజయలక్ష్మి ఉపాధిహామీ కూలీపనులు చేస్తూ ముగ్గురు ఆడపిలలను పోషించుకుంటూ చదివిం చింది. చిన్న కుమార్తె బోధన ప్రత్యూష ఉస్మానియ యూనివర్సిటీలో 2022లో ఎమ్ఏ(సోషియాలజీ)లో అత్యంత ప్రతిభ కనబరిచి గవర్నర్ చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. కుటుంబ పరిస్థితులు అంతంతమాత్రమే ఉన్నా మొక్కవోని దీక్షతో సంక్షేమ అధికారి పరీక్షలో కాళేశ్వరం జోన్-1లో 74వ ర్యాంకు సాధించింది. భవిష్యత్తులో ఎలాగైనా కష్టపడి టీజీపీఎస్సీ గ్రూప్-1 సాధించి పేద ప్రజల సంక్షేమానికి పాటుపడుతానని ప్రత్యూష తెలిపింది.



బోధన ప్రత్యూషయాదవ్



టీబీజీకేఎస్ వకీల్‌పల్లె గని పిట్ కమిటీ పరిచయం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ వకీల్‌పల్లె గని పిట్ కమిటీని గని మేనేజర్ రవికిరణ్‌కు ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ బుధవారం పరిచయం చేశారు. మేనేజర్ కార్యాలయంలో పిట్ కమిటీ సభ్యులతో కలసి గని సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పిట్ కమిటీ తీసుకువచ్చే సమస్యలను పరిష్కరించాలని కోరారు. పిట్ సెక్రెటరీగా వెంకటేశం, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా శ్రావణ్, ట్రెజరర్ మనోజ్‌లతో పాటు 13 మందితో కమిటీని నియమించినట్టు తెలిపారు.

ఆర్‌జీ-1 ఏరియాలో యాన్యువల్ ఇంక్రిమెంట్ పనులు

గోదావరిఖని, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్ పరిధిలోని ఆర్‌జీ-1, 2, 3, భూపాల్‌పల్లి ఏరియాలోని సుమారు 16వేల మంది ఉద్యోగుల 2024-25 సంవత్సరానికి సంబంధించిన యాన్యువల్ ఇంక్రిమెంట్ బుధవారం నుంచి ఆర్‌జీ-1 ఏరియా ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్నారు. యాన్యువల్ ఇంక్రిమెంట్‌ను రామగుండం రీజియన్ ఇంటర్నల్ ఆడిట్ ఫైనాన్స్ మేనేజర్ మోహన్‌రావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఆడిట్ అధికారులు, సుమారు 20మంది క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ విద్యా మాధవి, మణిదీప్, క్లరికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలో బుధవారం క్వార్టర్స్ కౌన్సిలింగ్ చేపట్టారు. ఎస్అండ్‌పిసి కార్యాలయం ఆవరణలోని నిర్వహించిన కౌన్సిలింగ్‌లో మొత్తం 174 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 46 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 25 మంది ఉద్యోగులు హాజరై 22 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు.

మతితప్పి మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

- టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఎంఎండీఆర్ యాక్ట్‌కు మద్దతు ఇవ్వలేదని, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్‌ప్రసాద్ మతితప్పి మాట్లాడుతున్నాడని, నోరు అదుపులో పెట్టుకోవాలని టీబీజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రధాన చౌరాస్తాలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా సమ్మె చేసింది బీఆర్ఎస్ పార్టీ అని, నైని బ్లాక్‌కు అనుమతులు తీసుకొచ్చింది బీఆర్ఎస్ అన్నారు. దేశంలో బొగ్గుగనుల ప్రైవేటీకరణకు కారణం కాంగ్రెస్ పార్టీ, దానికి వంతపాడింది ఐఎన్‌టీయూసీ అన్నారు. సుమారు 20వేల మందికి కారుణ్య నియామకాల ఉద్యోగాలను ఇప్పించిన చరిత్ర మాదేనని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, వడ్డపల్లి శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఇఫ్టూ ధర్నా

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ హైపవర్ వేతనాలు, సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఇఫ్టూ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులకు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గడిచిన మూడేళ్లుగా సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వలేదని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు ఒకరోజు విధులకు గైర్హాజరు అయితే వేతనం నుండి రూ. 720 రికవరీ చేయడం వలన కార్మికుడు ఆర్థికంగా నష్టపోతున్నట్టు కృష్ణ పేర్కొన్నారు.

ప్రశాంతంగా చదివి పది పరీక్షల్లో విజయం సాధించాలి

● ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్

కోల్‌సిటీటౌన్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు మంచి పౌష్టికా హారం తీసుకుంటూ ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదివి పరీక్షలు రాసి విజయం సాధిం చాలని సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఆకాంక్షించారు. బుధవారం గోదావరిఖనిలోని సింగ రేణి హైస్కూల్ సెక్టార్-2 పాఠశాలలో పది పరీక్ష లకు హాజరవుతున్న విద్యార్థులకు హాల్‌టికెట్లను జీఎం చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లలిత్‌కుమార్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఏకాగ్రతతో చదువుతూ విజయవంతంగా రాయాల న్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, అధికార ప్రతినిధి దేవరకొండ కిరణ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ : పదవతరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య సూచించారు. బుధవారం సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో జరిగిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరయ్యారు పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. సింగరేణి పాఠశాలలో చదువుకున్న అనేక మంది ఉతన్నత స్థానంలో ఉన్నారని, పాఠశాల పేరు నిలిపేలా ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పరీక్షల సమయంలో సమయపాలనతో చదవాలని సూచించారు. ఎస్వోటూ జీఎం రాముడు, కరస్పాండెంట్ అనిల్‌కుమార్, హెచ్ఎం సుందర్‌రావు పాల్గొన్నారు.

జీఎం కార్యాలంలో సంఘ నాయకులతో సమావేశం

రామగిరి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్ పరిధీలోని జీఎం కార్యాయలంలో బుధవారం ప్రాతినిధ్య సంఘం నాయకులతో జీఎంలు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏరియాలకు సంబంధించిన పారిశుధ్య పనులు, తడిపొడి చెత్త తరలించేందుకు వాహనాల ఏర్పాటు, ఓసిపి-1లో షవల్స్‌లోడ్ తీసుకోవడానికి అవసరమయ్యే వసతుల ఏర్పాట్లపై చర్చించారు. ప్రతి ఉద్యోగికి సన్మానం చేసేందుకు రూ. 6వేలు, దహన సంస్కారాలకు రూ. 5వేల నుంచి రూ. 15వేలకు పెంచాలని చర్చించారు. దీనిపై జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు రామారావు, సాయికృష్ణ, గడ్డం తిరుపతి, అధికారులు రఘుపతి, సత్యనారయణ, వైవి శేఖర్‌బాబు, సిహెచ్ వెంకటరమణ, రాజశేఖర్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, విశ్వేశ్వరరావు, మతీన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.